


# 117 వ భాగం

# పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర -10

పృధు చక్రవర్తి వేనుడి వంశంలో వాడు కదా, ఆయన ధర్మం కోసం రాజు అయ్యాక చేయాల్సిందంతా చేసి వైరాగ్యం అలవర్చుకుని తపస్సుతో ముక్తి పొందాడు. అయితే ఆయన వానప్రస్థం వచ్చినది ఆయన భార్య, అర్చి అనే ఆవిడతో. భారత దేశంలో ఆలు, మగలు ఇద్దరూ ఒకటే అనే విషయాలు పాత కాలం నాటినుంచీ ఉన్నవే. అందుకే మహర్షులకి ఒక భార్య ఉన్నా ఆవిడ కూడా భర్తతో పాటు సాధన చేస్తూ తపస్సు చేస్తూ ఉంటుంది మన వినే కథల్లో. ఇప్పుడు పృధువు పోయాక ఆవిడకి ఏమైందో చెప్తున్నాడు. ఒకటి గమనించండి – ఉద్ధరేనాత్మ ఆత్మానం అని కదా చెప్పుకున్నాం? అందువల్ల పృధువు, భార్యతో పాటు సన్యసించినా యోగమార్గంలో ఎవరిదారి వారిదే. దీన్నే నారాయణీయంలో భట్టాత్తిరి గారు అంటారు – కోనామ కస్య సుకృతం కథ మిత్యవేయాత్ – అని (స్వామీ జీవితంలో ఎవరు ఎటువంటి పుణ్యం చేసుకున్నారో ఎవరు చెప్పగలరు?)

క. తన మనమున నే దుఃఖము
నన యంబు నెఱుంగనట్టి యర్చి నిజాధీ
శుని ప్రాణరహిత దేహము
గనుఁగొని విలపించి విగతకౌతుక యగుచున్. [4-656]

భర్త పోవడం చూసి ఆయన విగత శరీరం చూసి ఏడిచి ఆవిడ - అప్పటి ధర్మం, కాలంలో ఉన్న ఆచారాల ప్రకారం - సతీ సహగమనం చేసింది. ఆ చేసినది కూడా శ్రీహరి అవతారమైన భర్తని, భగవంతుణ్ణి తల్చుకుంటూను. అందువల్ల ఆవిడ కూడా ముక్తి పొందింది.

క. పరికింపఁగనే మనుజుఁడు
హరి పదమును బొందఁ జేయునట్టి వివేక
స్ఫురణం దనర్చు వానికిఁ
బరువడి నిలఁ బొందరాని పదముం గలదే? [4-663]

ఆవిడకి కూడా ముక్తి కలగడం చూసి దేవతలు ఇలా అనుకున్నారుట – చూడబోతే మనుషులలో శ్రీహరి పదం, వైకుంఠం చేరాలనే జ్ఞానం ఉన్న పుణ్యాత్ములకి పొందలేనిది ఏమీ ఉండదు కదా.

క. వినినఁ బఠించిన వ్రాసిన
వినిపించిన వాఁడు పృథుఁడు విమల గతిం బొం
దిన క్రియ హరిపద మొందెడు
ననయము నిర్ధూతపాపుఁ డగచు మహాత్మా! [4-668]

సాధారణంగా ఇటువంటి కథలు చెప్పేటపుడు చివరిలో చెప్పే 'ఫల శృతి' చెప్తున్నారు. అది ఎందుకో తర్వాత చూద్దాం. ఈ పృథు చక్రవర్తి కథ విన్నా, రాసినా, చదివినా ఆయన పొందినట్టే హరిపదం పొందుతాడు అంటున్నారు. అయితే ఎవరైనా ఈ కథ రాయడం, వినడం, చదవడం చేయొచ్చా లేకపోతే ఇది కొందరికే పరిమితమా?

సీ. బ్రాహ్మణుఁ డంచిత భక్తిఁ బఠించిన
బ్రహ్మవర్చసము సంప్రాప్త మగును;
క్షత్రియుం దర్థిమైఁ జదివిన విన్నను
జగతీ విభుత్వంబు సంభవించు;
వైశ్యుండు విని ధనవంతుఁడై యొప్పును
శూద్రుండు వినిన సుశ్లోకుఁ డగును;
మఱియును భక్తి ముమ్మాఱు పఠించిన;
విత్తవిహీనుండు విత్తపతియు [4-669]

తే. నప్రసిద్ధుఁడు ప్రఖ్యాత యశుఁడుఁ బ్రజలు
లేని యధముఁడు వితత సంతానయుతుఁడు
మూర్ఖచిత్తుండు విజ్ఞాన బోధమతియు
నగుచు నుతి కెక్కుదురు మహితాత్మ! మఱియు. [4-669.1]

ఆ సంగతి కూడా ఈ సీసంలో చెప్తున్నారు. ఆ కాలంలో ఉన్న ఆచారాల ప్రకారం కులాలు నాలుగు కదా. ఆ నలుగురికీ ఏమౌతుందో చెప్తున్నారు. బ్రాహ్మణులకి బ్రహ్మ వర్చస్సు, క్షత్రియులకి, యుద్ధాలు చేస్తారు కనక అఖండమైన రాజ్యం (జగతీ విభుత్వంబు), వైశ్యులకి ధనం (వాళ్ళు వ్యాపారులు కనక), శూద్రులకి కీర్తి (సుశ్లోకుడు) కలుగుతాయి. పిల్లలు లేనివారికి పిల్లలు పుడతారుట. మూర్ఖుడికి జ్ఞానం కలుగుతుంది.

ఈ ఫల శృతి గురించి ఇప్పుడు చూద్దాం. ఏదో మంచి కథ విన్నాం. అందులో జరిగిన మంచి విషయం మనకి కూడా జరిగితే బాగుంటుంది అనిపిస్తుంది కదా? నాకు కూడా పృథు చక్రవర్తిలాగా రాజ్యం, యోగమార్గంలో ముక్తీ కలిగితే ఎంత సంతోషం? అయితే నాలుగు వర్ణాలవారూ చేసే పనులు వేరు వేరు కాబట్టి (అప్పట్లో) ఇది చదివితే వారి వారి జీవితాల్లో మార్పు వస్తుంది. ఎటువంటి మార్పు? మంచిదా చెడ్డదా? ఎప్పుడూ మంచిదే జరుగుతుంది, ఎవరి కోరికలు వారికి తీరుతాయి అని. అలా తీరగానే మరోసారీ మరోసారీ ఈ చరిత్ర చదవడమో రాయడమో, వినడమో జరుగుతుంది లేదా పనికట్టుకుని ఆ చదవడమో రాయడమో, వినడమో చేస్తారు. ఎందుకంటే ఓ సారి మంచి జరిగింది కనక మరోసారి జరగవచ్చు అనే ఆశతో. అలా చదువుతూ, వింటూ ఉంటే సాధన చేయాలనే కోరిక కలుగుతుంది. అక్కడ్నుంచి యోగమార్గంలో ప్రయాణించవచ్చు. కనీసం మరో జన్మలో అయినా ముక్తికి మార్గం కనిపించే దారి అది. అలా ఎవరికైనా సరే ముక్తి కలుగుతుంది; ఏ ఒక్కరికీ పరిమితం కాదు అని చెప్తున్నారన్నమాట. ఇదే ఫల శృతి లో చెప్పే విషయం; మనం దాని నుంచి నేర్చుకోవాల్సినది.

ఇక్కడనుండి పృథువు వంశం ఏమైందో మిగతా కథ.

క. పృథునకు నర్చికిఁ బుట్టిన
పృథు కీర్తిధనుండు ఘనుఁడు పృథుతుల్యుండై
పృథు శౌర్య ధైర్య ధుర్యుఁడు
పృథివిన్విజితాశ్వుఁ డొప్పె పృథివీపతియై. [4-671]

ఈ పద్యంలో పోతన "పృధువు" అనే పదాన్ని అతి చిత్రంగా ఎలా, ఎన్నిసార్లు వాడాడో గమనించారా? పృధువుకి అర్చికీ పుట్టిన కుర్రాడు ఎటువంటివాడు? పృధుకీర్తి ధనుండు (పృధు – దట్టమైన, కీర్తి ఉన్నవాడు), పృధుతుల్యుండై (పృధు చక్రవర్తి అంతటివాడు), పృధు శౌర్య ధైర్య ధుర్యుఁడు (పృధు – విశాలమైన, శౌర్యం, ధైర్యం; ధుర్యుడు – బాధ్యత వహించేవాడు), పృధివిన్విజితాశ్వుడు (పృధివిన్ – భూమిమీద, విజితాశ్వుడు – ఇంద్రుడు యాగాశ్వాన్ని ఎత్తుకుపోయినప్పుడు దాన్ని వెనక్కి తీసుకొచ్చాక ఈ కుర్రాడు విజితాశ్వుడు అని పిలువబడతాడు అని చెప్పారు కదా), రాజు (పృధివీ పతి – భూమిని పాలించే వాడు) అయ్యాడు. పద్యం, దాని అర్ధం ఎలా ఉన్నా ఓ సారి ఇది నోరు తడబడకుండా చదవడమే గగనం కదా? ఇదే తెలుగు భాషా సౌందర్యం.

క. విను మంతర్ధాన గతిం
దనరు సునాసీరు వలనఁ దగ విజితాశ్వుం
డును మఱి యంతర్ధానుం
డనుపేరఁ బ్రసిద్ధుఁ డయ్యె నతి చతురుండై. [4-672]

పృధువు చేసిన యాగంలో ఇంద్రుడు ఎవరికీ కనిపించకుండా యాగాశ్వాన్ని ఎత్తుకుపోయినప్పుడు ఈ విజితాశ్వుడు కూడా ఎవరికీ కనిపించకుండా అంతర్ధానం అయిపోయి వెళ్ళి యాగాశ్వాన్ని తీసుకొచ్చాడు కనక ఇతన్ని అంతర్ధానుడని కూడా పిలిచేవారుట.

సీ. స్థిరమతి రాజ్యాభిషిక్తుఁడై యమ్మేటి;
సమమతి నయ్యనుజన్ములైన
హర్యశ్వునకు సమాదరమునఁ దూర్పు, ద-
క్షిణదిశఁ దగ ధూమ్రకేశునకును,

బరఁగంగ వృకునకుఁ బశ్చిమభాగంబు ,-
ద్రవిణున కర్థి నుత్తరపుదిశను,
గొమ రొప్ప నలువురకును బంచి యిచ్చె స్వ-
కాంత యైనట్టి శిఖండినికిని [4-673]

-తే. మనుజ యోనిని జనియింపుఁ డనుచు మున్ను
పలికినట్టి వసిష్ఠు శాపమునఁ జేసి
పూని త్రేతాగ్ను లతనికిఁ బుత్రు లగుచు
జనన మొందిరి సజ్జనస్తవ్యచరిత! [4-673.1]

ఈ విజితాశ్వుడు మహారాజు అయ్యాక తన నలుగురు తమ్ములకీ – హర్యశ్వుడికి తూర్పు, ధూమ్రకేశుడికి దక్షిణం, వృకుడికి పశ్చిమం, ద్రవిణుడికి ఉత్తరం – పాలించమని ఇచ్చాడు. ఈ మహారాజు వాళ్ళావిడ పేరు శిఖండిని. ఆవిడ వల్ల ఈయనకి ముగ్గురు పుత్రులు పుట్టారు. ఈ ముగ్గురూ ఎవరంటే పూర్వం వశిష్టుడి వల్ల, మానవ జన్మ ఎత్తమని శాపం పొందిన త్రేతాగ్నులైన గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్ని అనేవారు.

వ. వారలు పావకుండుఁ బవమానుండు శుచియు నను నామంబుల మనుష్య యోనిం బుట్టియు నాత్మప్రభావంబునం గ్రమ్మఱ నగ్నులయి చనిరి; తదనంతరంబ. [4-674]

వీళ్ళు పావకుడు, పవమానుడు, శుచి అనే పేర్లతో మానవులుగా పుట్టినా వెంఠనే (ఆత్మ ప్రభావంబు గ్రమ్మఱ నగ్నులయి చనిరి) త్రేతాగ్నులుగా రూపాంతరం చెంది వెళ్ళిపోయారు. అంటే వారి శాపం పూర్తైంది. యోగమార్గంలో ఎవరి దారి వారిది అని చెప్పుకున్నాం కదా అలా వారు వెనక్కి వెళ్ళిపోయారు.

క. అతఁడు నభస్వతి యనియెడి
ద్వితీయ పత్ని వలనను హవిర్ధానుఁడు నా
సుతుఁగని విజితాశ్వుండా
నతవిమతుఁడు రాజ్యవర్తనము దలపోయన్. [4-675]

ఈయనకి నభస్వతి అనే రెండో భార్య వల్ల హవిర్ధానుడనే కొడుకు పుట్టాడు. ఓ సారి కధ వెనక్కి చూసుకుంటే పృధువు పుట్టేసరికి భూమి సారంగా లేదు. అయితే ప్రస్తుతానికి భూమి బాగా సారవంతంగా ఉంది. అందరికీ అన్నీ ఉన్నాయి. రాజుగారి ఖజానాలో ధనం కూడా పుష్కలంగా ఉంది. ఇందువల్ల ఈయన ఏమనుకున్నాడంటే...

క. విమలాత్మ! కరాదానము
దమశుల్కాదికము గరము దారుణ మని ధై
ర్యమునన్ దీర్ఘమఖవ్యా
జమునం దద్వర్తనంబు సమమతి విడిచెన్. [4-676]

పన్నులు (కరాదానము) అనేవి ప్రజలని పీడించడానికి వేసే అపరాధ రుసుము (దమశుల్కము). ఇది దారుణం కనక డబ్బుకోసం పీడించకూడదు అని అవన్నీ రద్దుచేసి వదిలేసాడు. ఏదైనా యజ్ఞం చేసేటప్పుడు ప్రజలు పన్నులు కట్టక్కర్లేదు కనక చాలారోజులు సాగే దీర్ఘమఖము అనే యజ్ఞం మొదలుపెట్టాడు.

క. అతఁ డాత్మదర్శనుం డయి
చతురతఁ బరమాత్ము హంసు సర్వేశ్వరుఁ ద
త్క్రతువున యజించి కుశలా
ద్భుత యోగసమాధి ముక్తిఁ బొందె మహాత్మా! [4-678]

అలా ఆయన ఆత్మ దర్శనుడై ఆ యజ్ఞం వల్ల సర్వేశ్వరుడు, హంస స్వరూపుడైన భగవంతుణ్ణి అరాధించి యోగసమాధి పొంది ముక్తి పొందాడు తల్లి తండ్రులలాగానే. ఇక్కడితో పృధు చరిత్ర అయిపోయింది. అసలు పురంజనోపాఖ్యానం మొదలయ్యేది ఇక్కడ్నుంచే. అది వచ్చే నెలనుంచి చూద్దాం.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS